క్లుప్తంగా

పాలసీదారుల సేవలో ఎల్‌ఐసీ ముందంజ

స్టేషన్ మహబూబ్‌నగర్: ఎల్‌ఐసీ వ్యాపారంలో ముందంజలో ఉందని, పాలసీదారుల సేవలో సరికొత్త ఒరవడులకు నాంది పలుకుతందని సౌత్‌సెంట్రల్ జోనల్ మేనేజర్ పునీత్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎల్‌ఐసీ బ్రాంచీ కార్యాలయంలో ఆధునీకరించిన ఏజెంట్ల ట్రెనింగ్ సెంటర్‌ను గురువారం ప్రారంభించి మాట్లాడారు. ఎల్‌ఐసీ పాలసీదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. నూతనంగా ప్రారంభమైన నవజీవన్‌శ్రీ గ్యారెండెంటీడ్ పాలసీ మార్కెట్లోకి ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి, మార్కెటింగ్ మేనేజర్ ప్రసాద్‌రావు, సేల్స్ మేనేజర్ రవీందర్, సీనియర్ బ్రాంచ్ మేనేజర్ మధుకుమార్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

టెస్సా జిల్లా కమిటీ ఎన్నిక



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ ఎకనామిక్ – స్టాటిస్టికల్ సబార్డినేట్ అసోసియేషన్(టెస్సా) జిల్లా కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బందిగి నర్సింహులు, కార్యదర్శిగా శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా విజయలక్ష్మి, మహిళా జాయింట్ కార్యదర్శిగా జ్యోతి, ట్రెజరర్‌గా ఖాజాపాషాతోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా టీఎన్‌జీఓ జిల్లా కోశాధికారి కృష్ణమోహన్ వ్యవహరించారు.

జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

గండేడ్: మండలంలోని అంచన్‌పల్లిలో పంచాయతీ భవన నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులు గురువారం శంకుస్థాపన చేశారు. ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి, తహసీల్దార్ మల్లికార్జునరావు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి సమక్షంలో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏఈ హలీం, శ్రీనివాస్‌రెడ్డి, చెన్నారెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

నకిలీవి విక్రయిస్తే చర్యలు

కోయిల్‌కొండ: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏఓ యమారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించి వాటికి రశీదు తప్పనిసరిగా అందించాలని సూచించారు. యూరియా వినియోగాన్ని తగ్గించాలని రైతులకు పేర్కొన్నారు.

సైనిక్ స్కూల్‌కు ఎంపిక

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని న్యూబ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్ కోయిల్‌కొండ విద్యార్థి అరుణ్‌కుమార్ సైనిక్ స్కూల్‌కు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాడెంట్ రాంచందర్, ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. కరీంనగర్ జిల్లా సైనిక్ స్కూల్‌లో జరిగిన మండల, జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ఓపెన్ కేటగిరీలో ప్రతిభ కనబర్చాడు. పాఠశాల ఉపాధ్యాయ బృందం అరుణ్‌కుమార్‌ను అభినందించి సన్మానించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని 27వ వార్డు ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, వార్డు కౌన్సిలర్లతో కలిసి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు విజయ్, కుమ్మరిరాజు, రహీం, రమేశ్, మార్కెట్ డైరెక్టర్ యాదయ్య, హెచ్‌ఎం చంద్రకళలు పాల్గొన్నారు. అంతకుముందు మహిళా సంఘం భవనం వద్ద రూ.2లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ లక్ష్మారెడ్డి, వైస్‌చైర్‌పర్సన్ సారిక పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

స్టేషన్ మహబూబ్‌నగర్: భారత్ వికాస పరిషత్ పాలమూరు శాఖ ఆధ్వర్యంలో బీవీపీ స్థాపన దివాస్ సందర్భంగా గురువారం స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులు, సహాయకులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. బీవీపీ ఆధ్వర్యంలో తమవంతు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో బీవీపీ సలహాదారులు నారాయణరావు, అధ్యక్షుడు భూషణ్‌పాండే, ఉపాధ్యక్షుడు వీఎస్‌ఆర్‌కే ప్రసాద్, కోశాధికారి వెంకటేశ్వర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

దాయాదుల మధ్య గొడవ

నవాబ్‌పేట: మండలంలోని కారుకొండలో దాయాదులైన రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవలో పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. గురువారం కారుకొండకు చెందిన కావలి కృష్ణయ్య ఇంటిపై అతని దాయాదులు దాడి చేసి కృష్ణయ్య భార్యతోపాటు పలువురిని గాయపరిచినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో కావలి రమేశ్‌తోపాటు పలువురిపై కేసులు నమోదయ్యాయి. కాగా ఇదే ఘటనలో కావలి రమేశ్‌తోపాటు అతని కుటుంబ సభ్యులను కావలి కృష్ణయ్య కుటుంబ సభ్యులు దాడి చేసి గాయపరిచారని వారు కూడా ఫిర్యాదు చేయగా.. కేసు నమోదైంది. గురువారం జరిగిన దాయాదుల ఘర్షణలో 8మందిపై కేసు నమోదైనట్లు ఎస్‌ఐ వివరించారు.

పర్మినెంట్ లేవాయే..!



రోడ్డుపైనే షట్టర్లలో నిర్వహిస్తున్న మహమ్మదాబాద్ తహసీల్దార్ కార్యాలయం

- ప్రభుత్వ కార్యాలయాలకు సొంతభవనాలు కరవు
- అద్దెభవనాల్లో కొనసాగుతున్న వైనం
- అవస్థలు పడుతున్న ప్రజలు

మహమ్మదాబాద్: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువయ్యాయి. మండలం ఏర్పాటై నాలుగేళ్లు గడుస్తున్నా.. అద్దె భవనాల్లోనే కొనసాగిస్తున్నారు. వివిధ సమస్యల కోసం వచ్చిన ప్రజలకు సౌకర్యాలు లేక అవస్థలు తప్పడం లేదు. మహమ్మదాబాద్ మండలంలోని 22 జీపీలు 20వరకు అనుబంధ గ్రామాలున్నాయి. ప్రజలకు అందుబాటులో పరిపాలనా సౌలభ్యానికి మహమ్మదాబాద్‌ను 2021లో మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. వివిధ పనులపై మండల కార్యాలయాలకు వచ్చే ప్రజలకు పక్కా భవనాలు లేక రోడ్డుపై నిరీక్షించాల్సి వస్తోందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

అద్దెభవనాల్లో కార్యాలయాలు

తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేసేందుకు మొదట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను ఎంపిక చేసుకుని మూడేళ్లు అక్కడే కొనసాగించారు. అక్కడ ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు కావడంతో కళాశాల కోసం కార్యాలయాన్ని ఖాళీ చేయించారు. ఎన్‌హెచ్ హైవేపై 167 రోడ్డు పక్కనే ఓ ప్రైవేటు అద్దెభవనంలో కొనసాగిస్తున్నారు. ఇటీవల ఐదునెలల క్రితం ఫిబ్రవరిలో ఏర్పాటైన ఎంపీడీఓ కార్యాలయాన్ని కూడా మహమ్మదాబాద్ గ్రామ చివర్లో ఉన్న నంబర్‌వన్ పాఠశాలలో నిర్వహిస్తున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయాన్ని అదే పాఠశాల భవనంలో కొనసాగిస్తున్నారు. ఇక ఎంఈఓ కార్యాలయం, వ్యవసాయశాఖ కార్యాలయాలు భవనాలు లేక కనుమరుగయ్యాయి. మహిళా సమాఖ్య కార్యాలయం కూడా గ్రామం మధ్యలో ఓ అద్దెభవనంలో ఏర్పాటు చేయడం మహిళలకు ఇబ్బగా మారింది.

> **నివేదిక పంపించాం**
>
> నూతన కార్యాలయాలకు పక్కా భవనాలు లేక ప్రజలు అధికారులు అవస్థలు పడుతున్న మాట వాస్తవమే. నూతన భవనాల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించాం. కొత్త భవనాల నిర్మాణం కోసం అనుమతులు వచ్చిన వెంటనే మండల కేంద్రానికి దగ్గర్లో నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.
>
> – నరేందర్‌రెడ్డి, ఎంపీడీఓ, మహమ్మదాబాద్

అవస్థలు పడుతున్న ప్రజలు

ముఖ్యంగా తహసీల్దార్ కార్యాలయానికి నిత్యం వందలాదిమంది ఎన్నో పనులతో వస్తుంటారు. వారికి తహసీల్దార్ కార్యాలయం రోడ్డుపై షెట్టర్లలో ఉండడంతో తగిన సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. ఎన్‌హెచ్‌హైవే 167 రోడ్డుకు ఆనుకుని ఉండడంతో ప్రజలు నిలబడలేక వాహనాలు పార్కింగ్‌కు ఇక్కట్లకు గురవుతున్నారు. ఎంపీడీఓ కార్యాలయం గ్రామం లోపల చివర్లో ఉండడంతో వాహనాలు వెళ్లలేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల కార్యాలయాల ఏర్పాటుపై కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఓవైపు ఎంపీడీఓ కార్యాలయం మరోవైపు మహిళా సమాఖ్య, అగ్రికల్చర్, ఎంఈఓ కార్యాలయాలు మరోవైపు ఉండి ఎక్కడికి వెళ్లాలన్నా ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ జీవనదిలాంటిది

- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి జెట్టి కుసుమకుమార్
- బీఆర్‌ఎస్‌ను ఖాళీ చేస్తాం: ఎమ్మెల్యే జీఎమ్మార్



బీఆర్‌ఎస్ యువత మండలాధ్యక్షుడు చంద్రశేఖర్‌ను పార్టీలో చేర్చుకుంటున్న ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి జెట్టి కుసుమకుమార్, ఎమ్మెల్యే జీఎంఆర్

అడ్డాకుల: దేశంలో ఎన్నో రాజకీయ పార్టీలు పుట్టినా అవి కరుమరుగై పోయాయని, కాంగ్రెస్ పార్టీ జీవనదిలాంటిదని.. గంగానది ఎంత పవిత్రమైనదో కాంగ్రెస్ పార్టీ కూడా దేశానికి అంతే పవిత్రమైనదని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి జెట్టి కుసుమకుమార్ అన్నారు. మూసాపేట మండల కేంద్రంలో గురువారం జరిగిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువత మండలాధ్యక్షుడు, అచ్చాయపల్లి మాజీ సర్పంచ్ బోయిని చంద్రశేఖర్, దాసర్‌పల్లి మాజీ సర్పంచ్ భాస్కర్‌గౌడ్, సూర్తితండా మాజీ సర్పంచ్ లలిత, మాజీ కోఆప్షన్ మదీనా జమీర్, మాజీ ఎంపీటీసీ కంద్యానాయక్, మాజీ ఉప సర్పంచ్ టైలర్ కలీంతోపాటు పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా.. కుసుమకుమార్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కుసుమకుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారందరూ కలిసిమెలిసి పనిచేసి వచ్చే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు కృషి చేయాలని కోరారు.

రెండోసారి నేనే ఎమ్మెల్యే: ఎమ్మెల్యే జీఎంఆర్

మూసాపేట మండలంలో బీఆర్‌ఎస్ ఖాళీ అవుతున్నందుకు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఉలిక్కి పడుతున్నారని, నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ను ఖాళీ చేస్తామని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులకు ముందున్నది ముసళ్ల పండుగేనని, వచ్చే ఎన్నికల్లో రెండోసారి తానే ఎమ్మెల్యేగా గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వందశాతం సీట్లను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని చెప్పారు. వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు మొత్తం తామే గెలుస్తామన్నారు. అనంతరం రైతు బీమా చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అంతకు ముందు కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అరవింద్‌రెడ్డి, శెట్టిశేఖర్, నాగిరెడ్డి, రామన్‌గౌడ్, బాలనర్సింహులు, కృష్ణయ్య, గోవర్ధన్, కృష్ణయ్య, నిరంజన్, రాంచందర్, మశ్చందర్‌నాథ్, సంతోషి పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



గండేడ్‌లో ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న డీఏఓ వెంకటేశం

గండేడ్/మహమ్మదాబాద్: గ్రామాల్లో ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశం పేర్కొన్నారు. గురువారం మండలంలోని బల్సూర్‌గొండ, గండేడ్, వెన్నాచేడ్ తదితర గ్రామాల్లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎరువుల దుకాణాల్లో స్టాకును పరిశీలించారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులపై ఆరాతీశారు. స్టాకు రిజిష్టర్లు, ధరల పట్టికలను పరిశీలించారు. రైతులు మందులు, విత్తనాలు కొనుగోలు చేస్తే వెంటనే రశీదులు అడిగి తీసుకోవాలన్నారు. ఒకవేళ ఇవ్వకపోతే వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ధరల పట్టికల్లో ఎరువుల ధరలను పొందుపర్చాలన్నారు. అన్ని ఎరువుల దుకాణాల్లో యూరియా, డీఏపీ అందుబాటులో ఉందని రైతులు ఎలాంటి ఇబ్బందులు పడొద్దన్నారు. షాపు యజమానులు రైతులకు ఇబ్బందులు కలగకుండా స్టాకును అందుబాటులో ఉంచాలన్నారు. కేవలం 30శాతం మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకొన్నారని మిగతా వారు కూడా వెంటనే చేసుకోవాలని తెలిపారు. ఏఓ నరేందర్ ఉన్నారు. మహమ్మదాబాద్ మండలంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను డీఏఓ వెంకటేశ్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎరువులను మిషన్ ద్వారా విక్రయించాలని డీలర్లకు సూచించారు. ఏఓ నరేందర్, వివిధ ఎరువుల దుకాణాల డీలర్లు ఉన్నారు.

అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

మిడ్జిల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బూత్‌లెవల్ ఆఫీసర్ల మీటింగ్‌ను గురువారం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ పరిశీలించారు. ఎన్నికల్లో బీఎల్‌ఓలు నిర్వహించాల్సిన పాత్ర గురించి వివరించారు. అనంతరం పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులను వివిధ అంశాలపై ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కష్టపడి చదవి ఉన్నత స్థాయికి ఎదుగాలని సూచించారు. క్రమంతప్పకుండా పాఠశాలకు హాజరై ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా చదవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, జీహెచ్‌ఎం సరస్వతి, మోహన్‌రెడ్డి, అంబికా, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

గండేడ్: విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని గండేడ్ మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీని సందర్శించి వసతులను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, తరగతి గదులు, నీటి వసతి, గదుల పరిస్థితిపై ఆరా తీశారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అన్న విషయాలను ఎస్‌ఓ శివలీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి, ఎంఈఓ జనార్దన్ ఉన్నారు.

హాస్టళ్లను తనిఖీ చేసిన కమిషనర్



బాలుర హాస్టల్‌లో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్

జడ్చర్ల టౌన్: కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని హాస్టళ్లను మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి గురువారం తనిఖీ చేశారు. సోషల్‌వెల్ఫేర్ బాలుర, బాలికల డిగ్రీ కళాశాల, బాలికల బీసీ హాస్టల్, సోషల్‌వెల్ఫేర్ బాలికల, గిరిజన బాలుర, గిరిజన బాలికల హాస్టళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనం పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజన వివరాలు తెలుసుకున్నారు. రిజిస్టర్లు పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లు నిర్వహించాలని సూచించారు. శానిటేషన్ గుర్తించి ఆరా తీశారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తనిఖీ వివరాలను ఆన్‌లైన్‌లో కలెక్టర్‌కు నివేదించారు.

ప్రచారాన్ని నమ్మొద్దు

అడ్డాకుల: మండలంలో యూరియా ఉందంటూ వస్తున్న ప్రచారాన్ని రైతులు నమ్మొద్దని ఏఓ అనిల్ కుమార్ తెలిపారు. మూసాపేట మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. యూరియా కొరత లేదని పేర్కొన్నారు. ఈ సీజన్‌కు మండలానికి అన్ని పంటలకు కలిపి సుమారు 950 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందని, ఇప్పటికే కావాల్సిన యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులు పంటకు కావాల్సిన సమయంలోనే యూరియాను కొనుగోలు చేయాలని కోరారు.

'కాంట్రాక్టర్లను బెదిరించిన చరిత్ర మీది'

దేవరకద్ర: కమిషన్ల కోసం కాంట్రాక్టర్లను బెదిరించిన చరిత్ర బీఆర్‌ఎస్ నాయకులదని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ హన్మంతరెడ్డి ఆరోపించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆర్వోబీ నిర్మాణం చేసిన కాంట్రాక్టర్‌ను బెదిరించి కమీషన్లను దండుకున్నారని, దేవరకద్ర పెద్ద చెరువుకు మంజూరైన మినీ ట్యాంకుబండ్ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ కమీషన్లు ఇవ్వలేక పారిపోయాడని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నాయకుల నిర్వాకంతో మినీ ట్యాంకు బండ్ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదని ఆరోపించారు. దేవరకద్రను అన్నిరంగాల్లో అభివృద్ధిలోకి తెస్తున్న ఘనత ఎమ్మెల్యే జీఎమ్‌ఆర్‌ది అన్నారు. సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి, వర్మ, గోవర్ధన్‌యాదవ్, రాంపాండు, రామాంజనేయులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు పోరాటం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కేంద్రం కార్మికుల సంక్షేమాన్ని కాలరాసేలా తెచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు కార్మికుల ఐక్య పోరాటం ఆగదని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సురేశ్ అన్నారు. గురువారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో కార్మిక సంఘాల జాయింట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి, టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్ పాల్గొని మాట్లాడారు.

ఎంపీ మల్లురవికి కాంగ్రెస్ నేతల వినతి

జడ్చర్ల టౌన్: జడ్చర్ల నుంచి నంద్యాల వరకు రైల్వే లైన్ వేయించాలని జడ్చర్ల కాంగ్రెస్ నాయకులు గురువారం రాత్రి ఎంపీ మల్లురవికి వినతిపత్రం అందజేశారు. కృష్ణానదిపై సోమశిల వద్ద బ్రిడ్జి నిర్మాణం జరుగుతున్నందున రాజమండ్రి తరహాలో రోడ్ కం రైల్వేలైన్ వచ్చేలా నిర్మింపజేయాలని విన్నవించారు. జడ్చర్ల రైల్వేస్టేషన్‌ను జంక్షన్‌లా మార్చి నాగర్‌కర్నూలు, వనపర్తి మీదుగా రైల్వేలైన్ వేయడంతో ఈ ప్రాంత వ్యాపారులు, ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. గతంలో వైఎస్సా ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సర్వే చేసిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మల్లురవి కేంద్ర రైల్వేశాఖ మంత్రిని కలసి మంజూరు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చినట్లు జడ్చర్ల కాంగ్రెస్ నాయకులు నిత్యానందం, అశోక్‌యాదవ్, యాదయ్య, మిట్టు తెలిపారు.

విశ్వబ్రాహ్మణ చైతన్య యాత్రకు ఘనస్వాగతం

జడ్చర్ల టౌన్: హైదరాబాద్ నుంచి బ్రహ్మంగారి మఠంకు బయలుదేరిన విశ్వబ్రాహ్మణ సాంస్కృతిక చైతన్య యాత్ర గురువారం జడ్చర్లకు చేరుకోగా.. విశ్వబ్రాహ్మణులు ఘనస్వాగతం పలికారు. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జరుగుతున్న యాత్ర నుద్దేశించి విశ్వనాథుల పుష్పగిరి మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా పద్ధతిన తమకు 400సీట్లు కేటాయించాలన్నారు. యాత్రకు స్వాగతం పలికిన వారిలో గోల్కొండ రాజేశ్, భాస్కరాచారి, రాజేశ్, రాజ్‌గోపాలచారి, సంతోష్‌చారి, వేణు, కృష్ణమూర్తి, సత్యం, శ్రీనివాస్, బాబు పాల్గొన్నారు. భాగంగా పట్టణంలోని సిగ్నల్‌గడ్డపై ఉన్న శ్రీకాంతాచారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భక్తిభావం పెంచుకోవాలి

జడ్చర్ల టౌన్: ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని భక్తిగాన లహరి దీక్షితులు సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని సకలదేవతల ఆలయంలో ఆయన అన్నమయ్య, సాయిబాబా కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తి, సంకల్పంతో ప్రవచనాలు వింటే ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుందన్నారు. ఆయన భక్తులతోనూ భజనలు, కీర్తనలు ఆలపింపజేశారు. కార్యక్రమంలో సంస్కార భారతి సభ్యుడు రాధాకృష్ణ, తబలిస్ట్ నర్సయ్య, కీబోర్డ్ కృష్ణయ్య, మృదంగం ప్రసాద్ పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



వ్యవసాయ అధికారులతో మాట్లాడుతున్న ఏడీఏ

నవాబ్‌పేట: రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని ఏడీఏ అంజనేయులు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతుల రిజిస్ట్రేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ కృష్ణకిషోర్‌తో కలిసి మాట్లాడుతూ.. రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే ఎలాంటి పథకం కావాలన్న రిజిస్ట్రేషన్ తప్పని సరి అన్నారు. లేకుంటే రైతులు ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా ఉండిపోతారని తెలిపారు. ప్రతి రైతు విధిగా ఏఓలకు సహకరించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ విషయంలో ఆయా గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అవగాహన కల్పించి వారిని ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకునేలా చేయాలన్నారు. ఈనెల 20వ తేదీ నాటికి మండలంలో మొత్తం వందశాతం రైతుల నమోదు జరగాలని సిబ్బందిని ఆదేశించారు.

సై టీబీ నిర్ధారణ పరీక్షలు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం సై టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. టీబీ వ్యాధిగ్రస్తులతో సన్నిహితంగా ఉన్నవారికి వ్యాధిసోకే అవకాశం ఉన్నందున, వారిలో లక్షణాలు లేకున్నప్పటికీ అంతర్గతంగా ఉన్న ఇన్‌ఫెక్షన్‌ను సై టీబీ పరీక్ష పసిగట్టడం జరుగుతుందని డా.మనుప్రియ వెల్లడించారు. శిబిరంలో సూపర్‌వైజర్ సలోమి, ఏఎన్‌ఎం సుజాత పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

- వేకువజామున కాగడహారతి, మహాన్యాస పారాయణం
- అభిషేకాలు, సామూహిక వ్రతాలు, పల్లకీసేవలు
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు



అమిస్తాపూర్ సమీపంలోని శ్రీసాయి సచ్చిదానంద ఆలయంలో సాయిని దర్శించుకుంటున్న భక్తులు



నవాబ్‌పేట: ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

స్టేషన్ మహబూబ్‌నగర్/అడ్డాకుల/గండేడ్/భూత్పూర్ /నవాబ్‌పేట /మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్ /జడ్చర్లటౌన్: గురుపౌర్ణమి వేడుకలను గురువారం పట్టణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని వివిధ ఆలయాల్లో ఉదయం నుంచి విశేష పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలోని శ్రీద్వారకామయి సాయి మందిరంలో వేకువజామున కాగడహారతి, మహాన్యాస పారాయణం, ఆలయ ఆవరణలో సామూ హిక సాయి వ్రతాలతోపాటు పల్లకీసేవ నిర్వహించారు. గణేశ్‌నగర్ సాయిబాబా ఆలయంలో అభిషేకం, సాయివ్రతాలు చేశారు. వెంకటేశ్వర కాలనీలోని షిర్డీసాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

- అడ్డాకుల మండలం కందూర్ స్టేజీ వద్ద సాయిబాబా ఆలయం వద్ద తెల్లవారుజామున విగ్రహాలకు పంచామృతాభిషేకం చేసి హోమం నిర్వహించారు.
- గండేడ్, కొంరెడ్డిపల్లి, పగిడ్యాల్, రుసుంపల్లి, పెద్ద వార్వల్, కప్లాపూర్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెన్నాచేడ్‌లో సాయి ఆలయంలో ఉత్సవ విగ్రహంతో ఆలయం చుట్టూ పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అనంతసేనారెడ్డి కుటుంబ సభ్యుల పాల్గొన్నారు.
- భూత్పూర్ మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ సమీపంలోని శ్రీసాయి సచ్చిదానంద ఆలయం, శేరిపల్లి (బి)లోని విద్యాసాయి మందిరంలో కాగడ హారతి నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పల్లకీసేవ నిర్వహించారు. శేజ్ హారతితో గురుపౌర్ణమి వేడుకలు ముగిశాయి.
- నవాబ్‌పేట, గురుకుంటలోని సాయి ఆలయాల్లో సాయినాథుడికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయా ఆలయాల్లో అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో నవాబ్‌పేట ఆలయ ట్రస్టీ రవీందర్, కార్యదర్శి సరస్వతీ తదితరులు పాల్గొన్నారు.
- జడ్చర్ల పట్టణంలోని ధర్మశాలలో ఉన్న దత్త మందిరంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాభిషేకం, అలంకరణ, పూజలతోపాటు డోలాహరణం జరిపించి అన్నదానం చేశారు. సకలదేవతల ఆలయంలోని సాయిమందిరంలో పల్లకీసేవ నిర్వహించారు. రాఘవేంద్రస్వామి మఠంలో ప్రత్యేక పూజలు చేశారు. విజయనగర్‌కాలనీలోని సాయి మందిరంలోనూ పంచామృతాభిషేకం, హోమం, పూజలు చేశారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఆంజనేయస్వామి ఆలయంలోని దత్తుడి ఆలయంలోనూ భక్తులు పెద్ద ఎత్తున మొక్కులు చెల్లించుకొన్నారు. పెద్ద గుట్టపై ఆలయంలోనూ పూజలు జరిపించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

గండేడ్: మండలంలోని కొంరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల, ఆశిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో హెచ్‌ఎం కృష్ణవేణి పవార్, ఉపాధ్యాయులను బీజేపీ నాయకులు శాలువాలు కప్పి సన్మానించారు. రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్, మండలాధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్కయ్య, నాయకులు రాజు, రవీందర్ పాల్గొన్నారు.

- పాలమూరు యూనివర్సిటీలోని తెలుగు డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఓడీ సంధ్యారాణి మాట్లాడుతూ వేదవ్యాసుడి జన్మదినాన్ని పురస్కరించుకుని గురుపౌర్ణమి వేడుకలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ కృష్ణయ్య, అధ్యాపకులు రవీందర్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని శ్రీద్వారకామయి సాయి మందిరంలో భక్తులు



జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వరస్వామి కాలనీలోని సాయి మందిరంలో భక్తులు



వెన్నాచేడ్ సాయి ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం



కొండేడ్‌పల్లిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

హన్వాడ: రాబోయే రోజుల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలకేంద్రంలో బీజేపీ మండల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో పార్టీ పూర్తిస్థాయి కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అంతకుముందు మండల అధ్యక్షుడిగా ఎంపికైన లింగన్నతోపాటు ప్రధాన కార్యదర్శులుగా వేణుగోపాల్‌యాదవ్, మల్లేశ్ ముదిరాజ్‌తోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పద్మజారెడ్డి, బాలరాజు, వీరబ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో ఉన్న పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పెన్షనర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు సాయిలుగౌడ్ అన్నారు. ఈ మేరకు గురువారం టీఎన్‌జీఓ భవన్‌లో పెన్షనర్ల యూనియన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ప్రభుత్వం నుంచి రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బకాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి అంజయ్య, సభ్యులు గౌస్, వెంకటయ్యగౌడ్, ప్రభాకర్‌చారి, బాలయ్య, సలీమ్ పాల్గొన్నారు.